క్లుప్తంగా

డెంగీ నివారణపై అవగాహన

తుని: డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజారోగ్యశాఖ అధికారి శేఖర్ సూచించారు. పట్టణంలోని 2వ వార్డులో ప్రజలకు సోమవారం డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద డ్రమ్ములు, ఖాళీ కొబ్బరి డొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలకు ఆవాసాలుగా ఉండే గుంతలు, కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు, శానిటేషన్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత 'వేగి'కి పరామర్శ

కోటనందూరు: ఇటీవల ప్రమాదానికి గురైన బొద్దవరం వైఎస్సార్ సీపీ నాయకుడు వేగి అప్పలనాయుడును సోమవారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, కోఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు, ఉప సర్పంచ్ దొడ్డి రమణ, ఉల్లూరి శ్రీను పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తుని: భారత్ వికాస్ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక పెంటకోట రోడ్డులోని సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 45 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వికాస్ పరిషత్ సభ్యులు వృద్ధులకు అన్నదానం చేశారు. మానవ సేవే-మాధవ సేవ నినాదంతో పేదలకు సేవలు అందిస్తున్నట్టు భారత్ వికాస్ పరిషత్ తుని శాఖ అధ్యక్షుడు డాక్టర్ పమ్మి లక్ష్మణాచార్యులు తెలిపారు. బీవీపీ స్టేట్ పీఆర్వో ఆంజనేయ ప్రసాద్, డాక్టర్ కోటిబాబు, తటవర్తి సూర్యప్రకాష్, నెల్లిపూడి నాగేశ్వరరావు, జానకీరామ్, శ్రీను, రాజబాబు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తిపై దృష్టి సారించాలి

తుని రూరల్: రైతులు విత్తనోత్పత్తిపై దృష్టి సారించాలని కాకినాడ శిక్షణ కేంద్రం ఏడీఏ మాధవి సూచించారు. మండలంలోని డి.పోలవరం, తేటగుంట గ్రామాల్లో రైతులకు సోమవారం ఏఓ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాధవి మాట్లాడుతూ విత్తన శుద్ధితో తెగుళ్లు తగ్గుముఖం పడతాయన్నారు. ఎరువుల వాడకంపై రైతులకు పలు సూచనలు చేశారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో ఎంపిక చేసిన రైతులకు ఎంటీయూ-1262 రకం విత్తనాలను ఉచితంగా అందించారు. ఏఈఓ పాలమరశెట్టి జగ్గాప్పారావు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ప్రత్తిపాడు రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని శాంతిఆశ్రమం పశువైద్యాధికారి ఎం.మంజూష అన్నారు. మండలంలోని చింతలూరులో పశువులకు సోమవారం దొమ్మ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పాడి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బొద్దు సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి బి.సుబ్రహ్మణ్యం, ఏహెచ్ఏలు జి.రాజబాబు, ఎస్.స్వామి ,రాజేష్, దుర్గాప్రసాద్ తదితరులుపాల్గొన్నారు.

ఉద్యాన అనుబంధ పరిశ్రమలు స్థాపించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీహెచ్ఓ మల్లికార్జునరావు

తుని రూరల్: అధిక ఆదాయాన్ని పొందేందుకు ఉద్యాన రైతులు అనుబంధ పరిశ్రమలు స్థాపించాలని కాకినాడ జిల్లా ఉద్యాన అధికారి (డీహెచ్ఓ) నేతల మల్లికార్జునరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం హెచ్ఓ జి.విజయలక్ష్మి అధ్యక్షతన విలేజ్ హార్టికల్చరల్ అసిస్టెంట్లకు, ఉద్యాన రైతులకు విలువ ఆధారిత పరిశ్రమల స్థాపనపై అవగాహన సదస్సు నిర్వహించారు. వర్జిన్ ఆయిల్, జీడిపప్పు శుద్ధి, మామిడి, జీడిమామిడి తదితర ఉద్యాన అనుబంధ పరిశ్రమల స్థాపనను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఇందుకు శిక్షణతో పాటు రాయితీలు అందిస్తున్నట్టు డీహెచ్ఓ మల్లికార్జునరావు తెలిపారు. తుని, కోటనందూరు, తొండంగి మండలాలకు చెందిన వీహెచ్ఏ, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సత్యప్రభ పర్యటన

రౌతులపూడి: టీడీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జి వరుపుల సత్యప్రభ సోమవారం మండలంలోని ఎ.మల్లవరం, ఎస్.అగ్రహారం, డీజేపురం, ఎన్.వీ నగరం తదితర గ్రామాలు పర్యటించారు. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలను కలిసి తమ సంఘీభావాన్ని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు తమరాన సత్యనారాయణ, ఇటంశెట్టి సూర్య భాస్కరబాబు, పల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష.. దిగుబడికి భరోసా

- గ్రామాల్లో జోరుగా మట్టి నమూనాల సేకరణ
- 30,575 హెక్టార్లలో ఖరీఫ్ సాగు
- రైతులకు బహుళ ప్రయోజనాలు



ఎస్.అన్నవరంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వీఏఏ, రైతులు

తుని రూరల్: పంటల సాగులో తెగుళ్ల నివారణ, నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు భూసారం ఎంతో అవసరం. భూమి సారవంతంగా లేకుంటే పంటల దిగుబడి తగ్గిపోతుంది. భూమిలో జింక్ లోపంతో పాటు భూసారం ఏ మేరకు ఉందో తెలుసుకుంటే అందుకు అనుగుణంగా ఎరువులు, పురుగు మందులు వాడవచ్చు. ఇవి తెలియాలంటే రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. భూసార పరీక్షలతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి. ఇందుకు ప్రతి సంవత్సరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్, రబీ పంటకాలనికి ముందుగా భూసార పరీక్షలు చేస్తున్నారు.

2498 మట్టి నమూనాల సేకరణ

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో భూసారాన్ని గుర్తించేందుకు లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో అధికారులు, రైతులు మట్టి నమూనాల సేకరణ పూర్తి చేశారు. సేకరించిన మట్టి నమూనాలను పరీక్షించేందుకు భూసార పరీక్ష కేంద్రాలకు తరలించారు. తునిలో భూసార పరీక్ష కేంద్రం భవనం శిథిలమవ్వడంతో నూతన భవన నిర్మాణం చేపట్టారు. మూడేళ్లవుతున్న భవన నిర్మాణం పూర్తికాలేదు. దీంతో ఖరీఫ్ సాగుకుగాను తుని సబ్ డివిజన్‌లోని ఐదు మండలాల నుంచి సేకరించిన 2498 మట్టి నమూనాలను సామర్లకోట భూసార పరీక్ష కేంద్రానికి తరలించారు. ఆ ఫలితాలు వచ్చిన తర్వాత లోపాలను సవరించనున్నారు.

లక్ష్యానికి అనుగుణంగా..

మెట్ట ప్రాంతమైన వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్‌లో 30,575 హెక్టార్లలో రైతులు ఖరీఫ్ పంటలను సాగు చేయనున్నారు. భూసారాన్ని గుర్తించేందుకు ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ కాలాల్లో మట్టి నమూనాలు సేకరించి పరీక్షిస్తారు. 2023 ఖరీఫ్‌కు జూన్ 30 నాటికి మట్టి నమూనాలు సేకరణ పూర్తి చేయాలని ఉన్నత అధికారుల ఆదేశించారు. లక్ష్యానికి అనుగుణంగా తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో 2,498 మట్టి నమూనాలను సేకరించారు. ఈ నమూనాలను పరీక్షించేందుకు భూసార పరీక్షా కేంద్రానికి తరలించారు.



తేటగుంట ఉద్యానతోటలో మట్టి నమూనాలు తీస్తున్న వీహెచ్ఏ, రైతులు

మూతపడిన భూసార పరీక్ష కేంద్రం

స్థానిక మార్కెట్ యార్డులోని భూసార పరీక్ష కేంద్రం శిథిలమవ్వడంతో మూతపడింది. సామగ్రి, యంత్ర పరికరాలను శిథిలమైన భవనం నుంచి తొలగించి ప్రత్యేక గదిలో భద్రపర్చారు. కొత్తగా రూ.40 లక్షలతో నిర్మిస్తున్న అగ్రికల్చర్ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ పనులు మూడేళ్లగా కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో ఇక్కడ చేయాల్సిన భూసార పరీక్షలకు సంబంధించి 2498 మట్టి నమూనాలను అధికారులు సామర్లకోటకు తరలించారు.

మండలం	మట్టి నమూనాలు	ఖరీఫ్ సాగు భూమి (హెక్టార్లలో)
తుని	732	6808
తొండంగి	510	7561
కోటనందూరు	470	6176
రౌతులపూడి	513	5607
శంఖవరం	273	4423
మొత్తం	2498	30,575

నాణ్యమైన దిగుబడులు



భూసార పరీక్షలతో రైతులకు బహుళ ప్రయోజనాల కలుగుతాయి. భూసారాన్ని పెంచుకోవడంతో తెగుళ్లు, పురుగులు అదుపులో ఉంటాయి. నాణ్యతగల అధిక దిగుబడులు సైతం లభిస్తాయి. సేకరించిన మట్టి నమూనాలను సామర్లకోట భూ పరీక్ష కేంద్రానికి పంపించాం. మొదట విడతలో ఆర్‌బీకేకు రెండు చొప్పున సేకరించిన మట్టి నమూనాల పరీక్షలు పూర్తయ్యాయి. ఫలితాలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది.

సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

'నాడు-నేడు' పనులను వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ ప్రసాదరావు

శంఖవరం: పాఠశాలల్లో జరుగుతున్న రెండో విడత నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని పెద్దాపురం డీఎల్‌డీఓ ప్రసాదరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకూ జరిగిన పనులపై ఆరా తీశారు. పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. పూర్తి చేసిన బిల్డింగులను ఆయా శాఖలకు అప్పగించాలన్నారు. వారానికి నాలుగు సార్లు పాఠశాలలను తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, ఎంఈఓ ఎస్‌వీ రమణ, ఏఓ పి.గాంధీ, ఎంఈఓ-2 గోవింద్, పంచాయతీరాజ్ జేఈ మురళీ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

రౌతులపూడి: శృంగవరం-మెరక చామవరం సమీపంలోని నందనవనంలో వేంచేసిన నాగలింగేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- బొద్దవరంలో సచివాలయం ప్రారంభం



బొద్దవరంలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: మహాత్మ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని బొద్దవరంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని సోమవారం సర్పంచ్ వేగి లక్ష్మి, ఎంపీటీసీ లగుడు దుర్గాభవానీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకొచ్చారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. సచివాలయాలకు వచ్చిన ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడాలని, మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ నాయకులు యల్లపు సత్యనారాయణ, దొడ్డి బాబ్జీ, నల్లమిల్లి గోవిందు, సుర్ల రాంబాబు, బొత్స సత్తిబాబు, గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, తహసీల్దార్ జగదీష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



రౌతులపూడి సీహెచ్‌సీలో గర్భిణులకు భోజనాలు వడ్డిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

రౌతులపూడి: ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి జానకీదేవి వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 70 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. స్థానిక దుర్గాదేవి ఆటో ఓనర్లు, డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో గర్భిణులకు మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్మన్ జిగిరెడ్డి రమణమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కైసర్ల సత్యనారాయణ, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ బర్రే రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

50 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

శంఖవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ యోజనలో భాగంగా పీహెచ్‌సీ డాక్టర్ ఆర్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో 25 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. పి.మల్లాపురం పీహెచ్‌సీలో 25 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్టు పీహెచ్‌సీ వైద్యురాలు ఆర్.లలితా రాణి తెలిపారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన



ఏలేశ్వరంలో ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న వలంటీర్లు

ఏలేశ్వరం/శంఖవరం: గ్రామ వలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం ఏలేశ్వరం, లింగంపర్తి, తిరుమాలి గ్రామాల్లో వలంటీర్ల ఆందోళన చేశారు. ఏలేశ్వరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పవన్‌కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పవన్‌కల్యాణ్ అవగాహన రాహిత్యంతో మాట్లాడడం సరికాదన్నారు. ప్రజలకు సేవ చేస్తున్న తమను విమర్శించడం దారుణమన్నారు. పవన్‌కల్యాణ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. శంఖవరం మండలం నెల్లిపూడి సచివాల యం వద్ద వలంటీర్లు పవన్ కల్యాణ్ దిష్టి బొమ్మను దహనం చేశారు.

పేద విద్యార్థులకు వరం అమ్మఒడి

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



కిర్లంపూడిలో విద్యార్థుల తల్లులకు అమ్మఒడి నమూనా చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

కిర్లంపూడి: అమ్మఒడి పథకం పేద విద్యార్థులకు ఓ వరమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో సోమవారం ఎంపీపీ తోట రవి అధ్యక్షతన నియోజకవర్గంలోని కిర్లంపూడి, జగ్గంపేట, గోకవరం, గండేపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు జగనన్న అమ్మ ఒడి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాలుగు మండలాల్లో చదువుతున్న 26,215 మంది విద్యార్థులకు సంబంధించి రూ.39.32 లక్షల నమూనా చెక్కును విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, జనపరెడ్డి బాబు, దోమాల గంగాధర్, చదలవాడ బాబీ, పెంటకోట నాగబాబు, ఎంపీటీసీ కాళ్ల దొంగబాబు, సాదే కుమారి, బిళ్లకుర్తి నాగమణి, కురుమళ్ల చిన్ని, పెనగంటి రాజేష్ పాల్గొన్నారు.

రేపు తాండవనీటి విడుదలపై సమావేశం

కోటనందూరు: తాండవ నీటి విడుదలపై ఆయకట్టు రైతులతో బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు తాండవ ప్రాజెక్ట్ డీఈఈ స్వామినాయుడు సోమవారం తెలిపారు. తాండవలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయకట్టు రైతులు హాజరు కావాలన్నారు. రైతులు నుంచి అభిప్రాయ సేకరణ అనంతరం నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని డీఈఈ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోకవరం: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ఎం వీఆర్ రెడ్డి సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..స్థానిక బంగాళపేటకు చెందిన ఎల్లే రాము (55) ప్రతిరోజు రాత్రి ఆరోపేట వద్ద గల చర్చికి పడుకోవడానికి వెళతాడు. అదివారం రాత్రి కూడా యథావిధిగా వెళ్తుండగా కైలాస భూమి వద్ద వెనక నుంచి వస్తున్న యాక్టివా స్కూటీ బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతడిని కుటుంబ సభ్యులు కాకినాడలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వర్షంతో ఉపశమనం

తొండంగి: మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. రెండు రోజుల నుంచి వేసవిని తలపించేలా ఎండ తీవ్రంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. నియోజకవర్గంలోని మెట్ట, పల్లపు ప్రాంతాల్లో ఖరీఫ్ పనులు మొదలయ్యాయి.

ముఖ్యమంత్రి జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- పెద్దనాపల్లిలో గడపగడపకూ...



పెద్దనాపల్లిలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని పెద్దనాపల్లిలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీనాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుద్ధా సూర్య ప్రకాష్, గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, బుద్ధా ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తీర్చేందుకే...

కిర్లంపూడి: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. మండల కేంద్రమైన కిర్లంపూడిలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. స్థానికులు రోడ్లు, డ్రైన్లు, వీధిదీపాలు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, పార్టీ మండల అధ్యక్షుడు దోమాల గంగాధర్, చదలవాడ బాబీ, పెంటకోట నాగబాబు, పెనగంటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కిర్లంపూడిలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

ప్రజా సమస్యల పరిష్కారానికే 'సురక్ష'

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- గ్రామాల్లో ఉత్సాహంగా జగనన్న సురక్ష



ధర్మవరంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



బొద్దవరం గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి దాడిశెట్టి రాజా



తాళ్లూరులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కోటనందూరు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని బొద్దవరంలో సోమవారం సర్పంచ్ వేగి లక్ష్మి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం ఉచితంగా 11 రకాల ధ్రువపత్రాలను అందిస్తోందన్నారు. ప్రజలు ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరిగే రోజులకు కాలం చెల్లిందన్నారు. సీఎం జగన్ పాలనలో అధికారులే ప్రజల దగ్గరకు వచ్చి వారి సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, తుని ఏఎంసీ చైర్మన్ మాకినీడు బాబు, వైస్ చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ, లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ చైర్మన్ బొంగు ఉమారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ఏలేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని పెద్దనాపల్లిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలోని లబ్ధిదారులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తొలుత గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి వరప్రసాద్, ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, తహసీల్దార్ చిన్నారావు, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, సర్పంచ్ బుద్ధా సూర్యప్రకాష్, గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, అలమండ చలమయ్య, అడపా పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేయడమే లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: ప్రజలకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ధర్మవరంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి చినబాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, సర్పంచ్ బెంతుకుర్తి సుశీలఅబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో ప్రజలకు ఉచిత సేవలు

కిర్లంపూడి: ప్రజల వద్దకే ప్రభుత్వ యంత్రాంగాన్ని తీసుకొచ్చి వారికి అవసరమైన సేవలు ఉచితంగా అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగపతినగరం సచివాలయం-2 పరిధిలో సోమవారం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పలు రకాల ధ్రువపత్రాలు అందజేశారు.

పేదల సొంతింటి కల సాకారం

గండేపల్లి: నిరుపేదల సొంతింటి కలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని తాళ్లూరులో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటిబాబు పాల్గొన్నారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటిని తీర్చేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయాల మండల కన్వీనర్ తాళ్లూరి మధు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, వైస్ ఎంపీపీ కుంచె రాజా, ఎంపీటీసీ చెల్లూరి రాంబాబు, గ్రామ సర్పంచ్ శీలామంతుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

జగ్గంపేట: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట శివారు సీతానగరంలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలోని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు కాపు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైఎస్సార్ సీపీ నేత కరుటూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

తుని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు అన్నారు. పట్టణంలోని 6వ సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కమిషనర్ ప్రసాదరాజు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తుని రూరల్: మండలంలో రాపాక, రాజుపేట గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. రాజుపేటలో లబ్ధిదారులకు ఎంపీపీ బొప్పన రాము వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. సర్పంచ్ బుద్ధాల సత్తిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్రహ్మణ్యేశ్వరీదేవి, ప్రోగ్రాం ఇన్‌చార్జి నేతల మల్లికార్జునరావు, నాయకులు వద్దాది ఏసుబాబు, కిల్లాడ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలన సీఎం జగన్‌కే సాధ్యం

తొండంగి: ప్రజలకు పారదర్శక పాలన అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత అన్నారు. మండలంలోని ఒంటిమామిడిలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, తహసీల్దార్ బి.సుబ్రహ్మణ్యం, పార్టీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, పార్టీనాయకులు గాబు రాజు, మడదా హేమంత్, సర్పంచ్ అంగుళూరి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.